'నామినేటెడ్' పందేరం

- పోస్టులను దక్కించుకునేందుకు పట్నం కాంగ్రెస్ నేతల యత్నాలు
- హాట్‌టాపిక్‌గా మారిన మార్కెట్ కమిటీ చైర్మన్
- పదవుల భర్తీలో ఎమ్మెల్యేపై పెరుగుతున్న ఒత్తిడి
- నాయకత్వాన్ని మచ్చిక చేసుకునే పనిలో ఆశావాహులు

ఇబ్రహీంపట్నం, జూన్ 11 : నామినేటెడ్ పదవులను భర్తీ చేయటానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు మరిన్ని నామినేటెడ్ పదవుల కోసం పట్నం కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నియోజకవర్గంలో ఎన్నో ఏండ్లుగా పార్టీని అంటిపెట్టుకుని పార్టీకోసం పనిచేసిన పలువురు నేతలు నామినేటెడ్ పదవులపై గురిపెట్టారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నామినేటెడ్ పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని ప్రకటించారు. దీంతో పలువురు కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యేతో పాటు ఇతర నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ఇప్పటికే మల్‌రెడ్డి రాంరెడ్డికి ప్రభుత్వం రోడ్లు డెవలప్‌మెంట్ చైర్మన్‌గా ప్రకటించింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్‌కమిటీతో పాటు బాటసింగారం పండ్లమార్కెట్ వంటివి ఉన్నాయి. వీటితో పాటు ఆర్టీఏ డైరెక్టర్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వంటి నామినేటెడ్ పోస్టులు కూడా ఉన్నాయి. వీటి కోసం నాయకులు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ సీనియర్ నాయకులతో పాటు గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిన పలువురు తెలంగాణ ఉద్యమకారులు కూడా నామినేటెడ్ పదవులు కోరుతున్నారు. ఇబ్రహీంపట్నంకు చెందిన టీపీసీసీ కార్యదర్శి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అతి సన్నిహితుడైన చిలుక మధుసూదన్‌రెడ్డి కూడా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ రేసులో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఆయన ఇప్పటికే ముఖ్యమంత్రిని కలిసి కార్పొరేషన్ చైర్మన్ కోరినట్లు తెలిసింది. ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇప్పటి వరకు ఎస్సీలకు కేటాయించారు. ఒకటర్మ్ ఎస్సీ పూర్తి చేయటంతో ప్రస్తుతం ఈ పదవి ఎస్సీలకా.. లేక జనరల్‌కు ఉంటుందా? అన్న చర్చ జరుగుతుంది. ఎస్సీలకు కేటాయిస్తే ఉద్యమకారుల కోటాలో ఇబ్రహీంపట్నం మాజీ సర్పంచ్ కప్పరి లక్ష్మయ్య ఉన్నారు. బోసుపల్లి వీరేశ్‌కుమార్, మంఖాల దాసు, మంఖాల కరుణాకర్‌తో పాటు పలువురు ఉన్నారు. ఇబ్రహీంపట్నంకు బీసీలకు కేటాయిస్తే డబ్బికార్ శ్రీనివాస్, జగదీశ్‌యాదవ్, యాచారం మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు ఉన్నారు. దీంతో చైర్మన్ ఎంపిక ఎమ్మెల్యేకు సవాల్‌గా మారింది. జనరల్‌కు కేటాయిస్తే ఇబ్రహీంపట్నంకు చెందిన మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి ముందువరుసలో ఉన్నారు. ఆయన కాదంటే ఆరుట్ల మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు మరికొంతమంది నాయకులు పోటీలో ఉన్నారు. పదవుల కోసం ఎవరికివారే ఏ అవకాశం ఉన్నా ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.

ఇబ్రహీంపట్నం మార్కెట్‌యార్డు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నవలయపల్లిలో ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీవో తులసి

చేవెళ్ల రూరల్, జూన్ 11 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి తులసి అన్నారు. మంగళవారం చేవెళ్ల మండల పరిధిలోని ఖానాపూర్ ఎక్స్‌రోడ్డులో, అంతారం అనుబంధ గ్రామం నవలయపల్లిలోని లక్ష్మీఅనంతపద్మనాభ, శ్రీనివాస ట్రేడర్స్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు విత్తనాలను ఎమ్మార్పీ రేట్లకే విక్రయించాలని, తప్పనిసరిగా రసీదు అందజేయాలని సూచించారు. ఎవరైనా నింధనలకు విరుద్ధంగా విత్తనాలు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఏవో వెంట మండల వ్యవసాయ విస్తరణాధికారి రాజేశ్వర్‌రెడ్డి, డీలర్లు తదితరులు పాల్గొన్నార.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, జూన్ 11 : మండల కేంద్రంలో సమీపంలోని బట్టర్‌ఫ్లై సిటీ వెంచర్‌లోని విల్లాలో జరిగిన ఇద్దరు యువకుల హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలని జడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని గోవిందాయిపల్లి గ్రామంలో మృతుల కుటుంబ సభ్యులను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి వారు పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధిత కుటుంబాలకు రాధాకృష్ణ ట్రస్టు తరపున జడ్పీటీసీ ఐదు వేల చొప్పున రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వీరయ్య, మాజీ సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, దేవానాయక్, మాజీ ఉప సర్పంచ్‌లు ఎల్లాగౌడ్, పాండునాయక్, నాయకులు యాదయ్య, రహీం, సోమయ్య, జంగయ్య, చెన్నయ్య, వెంకటయ్య, సాయిలు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

టెండర్లకు దరఖాస్తుల ఆహ్వానం

యాచారం, జూన్11: బస్టాండ్‌లో గల రెండు షెటర్లు, టూవీలర్ పార్కింగ్, ఒక టీస్టాల్, ఒక చెప్పుల షాప్ నిర్వాహణకు టెండర్ కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు డిపో మేనేజర్ వెంకటనర్సప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్లలో పాల్గొనే వారు షెటర్లు, టూవీలర్ పార్కింగ్, ఫుట్‌వేర్ షాప్ కోసం రూ.30 వేలు, టీస్టాల్ కోసం రూ.20 వేలు అడ్వాన్స్ చెల్లించాలని సూచించారు. ఈనెల 18లోగా హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్‌స్టేషన్‌లో గల హెచ్ఆర్ కార్యాలయంలో శివశంకర్ వద్ద దరఖాస్తు ఫారాలను తీసుకుని, వాటిని నింపి టెండర్ బాక్సులో వేయాలని తెలిపారు. రెండు షెటర్లు, టీస్టాల్, ఫుట్‌వేర్ దుకాణం నిర్వాహణకు 5 సంవత్సరాలు, టూ వీలర్ పార్కింగ్ నిర్వహణకు 4 సంవత్సరాల కాలం టెండర్ గడువు ఉండనున్నట్లు తెలిపారు.

13న జరిగే ధర్నాను విజయవంతం చేయండి

సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు సంబంధించిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేస్తున్న ఆశ వర్కర్లు

మంచాల, జూన్ 11 : తెలంగాణ రాష్ట్రంలో ఆశవర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం 13న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వైద్యాధికారులకు ధర్నాకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశవర్కర్లకు నష్టం కలిగించే ఎగ్జామ్ పెట్టే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అమృత, కవిత, మంజుల, సంతోష, జ్యోతి, పారిజాత, ఐలమ్మ, సువర్ణ, శ్యామల, స్వరూప, సుమలత, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కడ్తాల్ :పాఠశాలల హెచ్ఎంలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో సర్దార్‌నాయక్, ఎంఎన్‌వో జంగయ్య

కడ్తాల్, జూన్ 11 : ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందని ఎంఈవో సర్దార్‌నాయక్, ఎంఎన్‌వో జంగయ్య అన్నారు. మంగళవారం పలు గ్రామాల్లో అధికారులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని విద్యార్థుల ఇంటింటికీ తిరుగుతూ పాఠశాలలో అందిస్తున్న విద్య, కల్పిస్తున్న వసతులు గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన హెచ్ఎంలకు పాఠ్య, నోట్ పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణారెడ్డి, రత్నమాల, యాదయ్య, వెంకటేశ్వర్లు, శైలజ, గోవర్ధన్, శ్రీనివాసచారి, ఏపీఎం రాజేశ్వరి, పీఈటీ మల్లేశ్ పాల్గొన్నారు.

చేవెళ్లటౌన్ : మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాల ఉపాధ్యాయులకు ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకర్, సీఆర్పీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తలసానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

షాద్‌నగర్, జూన్ 11: మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోదరుడు శంకర్ యాదవ్ మృతి చెందడంతో మంగళవారం షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల్లో మాజీ మంత్రి కేటీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. కొన్నేండ్లుగా మోండ మార్కెట్‌లో వ్యాపార కార్యకలాపాలను నిర్వహించి వ్యాపార సంఘం తరపున వ్యాపారులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. రైతులకు సేవలందించిన శంకర్‌యాదవ్ మృతి బాధాకరమన్నారు.

అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్, జూన్11: తెలంగాణ సాంఘిక సంక్షేమ వికారాబాద్ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో బోధన చేయడానికి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాసశర్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తోలుకట్టా గ్రామ సమీపంలో ఉన్న వికారాబాద్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు కంప్యూటర్ సైన్స్, కామర్స్, జువాలజీ పార్ట్ టైం బోధించడానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు సాధించి పీహెచ్‌డీ , నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు దరఖాస్తుకు సర్టిఫికెట్ కాపీలను జతపర్చి ఈ నెల 14వ తేదీన సాయంత్రం 4 గంటల వరకు తోలుకట్టాలోని కళాశాలలో ఇవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు 837 4915652 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

సెల్ టవర్‌ను తొలగించాలని వినతి

షాద్‌నగర్‌టౌన్, జూన్ 11: నివాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న ఎయిర్‌టెల్ సెల్ టవర్‌ను తొలగించాలని మున్సిపల్ మేనేజర్ నయూంకు మంగళవారం మున్సిపల్ 22వ వార్డు నాయకుడు యాదగిరియాదవ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్ టవర్ నుంచి వచ్చే రేడియేషన్‌తో స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు.

పాఠశాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి

కస్తూర్బా పాఠశాల భవనం ఎదుట మాట్లాడుతున్న జడ్పీటీసీ

కడ్తాల్, జూన్ 11 : పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న తరుణంలో మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలకు అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడం బాధాకరమని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం సమీపంలోని నూతనంగా నిర్మించిన కస్తూర్బా పాఠశాలను వైస్ ఎంపీపీ ఆనంద్‌తో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ.. 24 గంటల్లో పాఠశాలకు కరెంట్ కనెక్షన్ ఇవ్వకపోతే విద్యుత్ శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ప్రియ, మంజుల, మాజీ ఎంపీపీ సువాలీపంతూనాయక్, మాజీ సర్పంచ్‌లు తులసీరాంనాయక్, హరిచంద్‌నాయక్, సాయిలు, భూనాథ్‌నాయక్, దేవానాయక్, కస్నానాయక్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ, నాయకులు వీరయ్య, పాండు, శ్రీను, సోమ్లా, నర్సింహ పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలలు పున:ప్రారంభం

పోతుగల్ ప్రాథమిక పాఠశాలలో గదులను నీటితో శుభ్రం చేస్తున్న సిబ్బంది

షాబాద్, జూన్ 11: పాఠశాలలకు వేసవి సెలవులు ముగియడంతో బుధవారం నుంచి పున:ప్రారంభం కానున్నాయి. షాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను సిబ్బంది నీటితో కడిగి శుభ్రం చేస్తున్నారు. అదే విధంగా గత కొన్ని రోజులుగా విద్యార్థులు లేక మూతపడిన పాఠశాలలన్ని నేటి నుంచి మళ్లీ తెరుచుకోనున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో ఆయా గ్రామాల్లో విద్యా శాఖ అధికారులు గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించాలని అవగాహన కల్పిస్తున్నారు. వాటిని కూడా శుభ్రం చేసి విద్యార్థులను పాఠశాలలో చేర్చుకునేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం, జిల్లా కార్యదర్శి గుండన్నగారి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు మంగళవారం కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, వైభవ్, త్రినేత్ర, కార్యకర్తలు ఉన్నారు. **– చేవెళ్లటౌన్, జూన్ 11**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బండి సంజయ్‌కుమార్‌ని ఢిల్లీలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
– కడ్తాల్, జూన్ 11

భవన నిర్మాణాలను పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, జూన్ 11 : మండల కేంద్రంలో చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణాల పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులకు ఆదేశాలిచ్చారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం, కేజీబీవీ పాఠశాల భవనాల నిర్మాణ పనులను మంగళవారం సాయంత్రం స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తుది దశకు చేరుకున్న తహసీల్దార్ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని సూచించారు. అదే విధంగా కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజ్, పీఆర్ ఏఈ పరమేశ్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, పీఏసీఎస్ డైరెక్టర్లు వెంకటేశ్, డాక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు నర్సింహ, వేణుగోపాల్, బీచ్చానాయక్, నాయకులు భాస్కర్ రెడ్డి, యాదయ్య, జహంగీర్‌అలీ ఉన్నారు.

రైతు భరోసా నిధులను విడుదల చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్లటౌన్, జూన్ 11 : రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల ముందు రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. వర్షాలు కురుస్తునందున రైతులు పంటలు వేసేందుకు విత్తనాలు, ఎరువులు కొనుక్కోవడానికి రైతు భరోసా కింద నిధులు విడుదల చేయాలని అన్నారు. చేవెళ్ల లోని 75 సర్వే నెంబర్‌లో 16 నెలలుగా పేద ప్రజలు గుడిసెలు వేసుకుని భూ పోరాటం చేస్తున్నారని, వారికి ప్రభుత్వం వెంటనే ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు మంజుల, నాయకులు లలిత, విజయమ్మ, శ్రీకాంత్, పెంటయ్య, ఎలీషా, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లు

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 11 : రెండు సంవత్సరాలుగా చూపులేని వృద్ధులను చేరదీసి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించినట్లు సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కెర గోపి శంకర్‌యాదవ్ తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్, మాల్‌మల్లేపల్లి, హయత్‌నగర్, పటాన్‌చెరువు, నాదర్‌గుల్, షాద్‌నగర్, గుర్రంగూడ, చౌటుప్పల్ ప్రాంతాలకు చెందిన 52 మంది పేద వృద్ధులకు మంగళవారం ఉచిత కంటి ఆపరేషన్లు చేయించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 204 మంది వృద్ధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ధనలక్ష్మి ఆప్టికల్స్ ఆస్ట్రో మెట్రిస్ట్ జి రాజేష్‌గౌడ్, సురక్ష సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఒంటరి వృద్ధులకు ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించిన సురక్ష సేవా సంఘం నాయకులు

దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, జూన్ 11: తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో టీచర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షాబాద్ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాచ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో టీజీటీ, పీజీటీ పోస్టులకు ప్రభుత్వం అనుమతించిందని చెప్పారు. ఏడు టీజీటీ పోస్టులలో(తెలుగు-1, ఇంగ్లీషు-1, హిందీ-2, మ్యాథ్స్-1, సోషల్-1, సైన్స్-1). పది పీజీటీ పోస్టులలో(తెలుగు-2, మ్యాథ్స్-2, బొటనీ-1, జువాలజి-1, సివిక్స్-1, కామర్స్-1)పోస్టులకు దరఖాస్తులు తీసుకోనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు డిగ్రీ, పీజీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు 13-06-2024, ఉదయం 10 గంటలకు తమ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు మోడల్ స్కూల్‌లో 9963425217కి సంప్రదించాలన్నారు.

సేవలను విస్తృతపరుస్తాం

కడ్తాల్, జూన్ 11 : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతపరుస్తామని క్లబ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ మహేందర్‌రెడ్డి, జిల్లా మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు-గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో 100 రోజులపాటు రాగి జావను పంపిణీ చేశారు. చివరి రోజు మంగళవారం రాగి అంబలి కేంద్రంలో జావ పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, సెక్రటరీ గోవర్ధన్‌రెడ్డి, సభ్యులు రాంరెడ్డి, శ్రీను, అంజయ్య, రమేశ్ పాల్గొన్నారు.

విత్తన కొనుగోలు, సాగుపై అవగాహన

రైతు వేదికలో రైతులకు వీసీ ద్వారా అవగాహన కల్పిస్తున్న అధికారులు

మొయినాబాద్, జూన్ 11 : రైతులకు విత్తనాల కొనుగోలు, పంటల సాగుపై అవగాహన కల్పించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని రైతు వేదికలో చేవెళ్ల డివిజన్ పరిధిలోని అన్ని మండలాల రైతులు, వ్యవసాయ శాఖ అధికారులకు విత్తనాల కొనుగోలు, పత్తి పంట సాగుపై అవగాహన కల్పించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని వ్యవసాయ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతులకు విత్తనాల కొరత ఉండకూడదన్నారు. దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయించకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా రైతులతో వ్యవసాయ అధికారులు వీసీ ద్వారా నేరుగా మాట్లాడారు. రైతులకు ఉన్న సందేహాలను వ్యవసాయ శాఖ అధికారులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏడీఏ రమాదేవి, మొయినాబాద్ వ్యవసాయ అధికారి రాగమ్మ, చేవెళ్ల ఏవో తులసి, శంకర్‌పల్లి ఏవో సురేష్‌కుమార్, షాబాద్ వెంకటేశం, ఏఈవోలు కుమార్, సునీల్ పాల్గొన్నారు.

సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య

షాబాద్, జూన్ 11: సర్కార్ బడుల్లోనే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీవో అపర్ణ, ఎంఈవో శంకర్‌రాథోడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు విద్యార్థులకు సంబంధించిన యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం నర్సింహులు, మండల నోడల్ అధికారి లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు హనుమంతు, ప్రశాంత్, స్వప్న, లక్ష్మమ్మ, గాయత్రి, ఖాజాపాషా, వైశాలి, ప్రసన్న, గణేశ్, క్లస్టర్ సీఆర్పీ లింగం, మహిళా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇండ్లలో చోరీ

ఆదిబట్ల, జూన్ 11 : రెండు ఇండ్లల్లో చోరీ చేసి బంగారు నగలు, వస్తువులను అపహరించిన ఘటన మంగళవారం జరిగింది. సీఐ వివరాల ప్రకారం.. రాగన్నగూడకు చెందిన చిన్ముల మౌనిక భర్త నరేందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఏబీఆర్ కన్వెన్షన్‌హాల్ సమీపంలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం మౌనిక బట్టలు ఉతికి తన రెండవ అంతస్తులో ఆరేయడానికి వెళ్లింది. తిరిగి తను ఉండే ఇంటికి వచ్చి చూడగా.. లోపలి నుండి గడియ వేసి ఉన్నది. కిటికిల్లో నుంచి చూడగా.. ఓ వ్యక్తి మొఖానికి మాస్కు ధరించి ఇంట్లో ఉండటాన్ని గమనించి పక్క వారిని పిలవడానికి వెళ్లింది. అప్పటికే ఇంట్లో ఉన్న బంగారు కంకణం, గొలుసు, ఉంగరం, నగదును అపహరించాడు. మరో సంఘటనలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన తిరుమన తురై వ్యాపారం చేస్తు నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వాచ్‌మెన్‌ను బెదిరించి తాళ్లు కట్టివేసి నిచ్చన వేసుకుని బాల్కానిలోకి వెళ్లడానికి ప్రయత్నించారు. దీంతో వెంటనే మేల్కొన్న ఇంటి యజమాని 100 నెంబర్‌కు కాల్ చేయడంతో.. గమనించిన నిందితులు ఇంటి వాచ్ మెన్ వద్ద ఉన్న రూ.12 వేల నగదు, సెల్‌ఫోన్‌తో పరారయ్యారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

13 టిప్పర్లు పట్టివేత

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 11 : చింతపల్లి మండలం నుంచి కొంగరవైపు అక్రమంగా మట్టిని తరలిస్తున్న 13 టిప్పర్లను మంగళవారం సాయంత్రం ఇబ్రహీంపట్నం పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. మట్టిని తరలించేవారిపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.